# అభివృద్ధి పథంలో ఖానాపూర్

- నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు
- పదేండ్లలో గణనీయమైన మార్పు



ఖానాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు

కడెం, నవంబర్ 25: నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నది. పరిపాలన వ్యవస్థ మెరుగుపడింది. అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను అధికారులు సద్వినియోగం చేసుకొని గ్రామాలు, పట్టణాలు ప్రగతి బాట పట్టిస్తున్నారు. నియోజకవర్గంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, జన్నారం, ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాలు ఉన్నాయి. ఇందులో దస్తురాబాద్, పెంబి, సిరికొండ నూతన మండలాలుగా ఏర్పాటు అయ్యాయి. ఖానాపూర్ మండలంలో రూ. 390 లక్షలతో సమీకృత మార్కెట్, రూ.3 కోట్లతో 5000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మించారు. నూతన మున్సిపాలిటీ ఏర్పాటు, మున్సిపాలిటీ పరిధిలో సెంట్రల్ లైటింగ్, డివైడర్స్, డబుల్ రోడ్డు, 400కు పైగా డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం, రూ.50 లక్షలతో డంప్‌యార్డ్, ఉద్యానవనం ఏర్పాటు చేయడంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. కడెం మండలంలో రూ. 280 కోట్లతో మిషన్ భగీరథ ఏర్పాటు చేసి ఐదు మండలాలకు నిత్యం తాగునీటి సరఫరా చేస్తున్నారు. కడెంలో 200 డబుల్‌బెడ్రూం ఇండ్లు, రూ.70 కోట్లతో బెల్లాల్ నుంచి బోర్నపల్లి వరకు గోదావరిపై వంతెన నిర్మించారు. రూ. 2.74 కోట్లతో హరిత రిసార్ట్ నిర్మించి పర్యాటకులకు మరింత సౌకర్యాలు మెరుగుపర్చారు. అలాగే దస్తురాబాద్ మండలంలోని 80 హెక్టార్ల పరిధిలో లక్ష మొక్కలను పెంచారు. అలాగే నూతన మండలం కావడంతో కడెం మండలంలోని పాండ్వాపూర్ నుంచి బుట్టాపూర్ వరకు డబుల్ రోడ్డు, దస్తురాబాద్ నుంచి గొడిసెర్యాల వరకు రూ.6.25 కోట్లతో తారు రోడ్డు, రూ.3.54 లక్షలతో కేజీబీవీ నూతన భవన నిర్మించారు. పెంబిలో రూ. 3 కోట్లతో కేజీబీవీ భవన, రావిగౌడ, పస్పుల గ్రామాల్లో చెక్‌డ్యాం, పెంబి నుంచి చెట్‌పెల్లి వరకు రూ. 2 కోట్లతో తారురోడ్డు, పెంబి నుంచి కొసగుట్ట వరకు రూ. కోటి50లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. వీటితో పాటు అనేక గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందాయి.



ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్



ఖానాపూర్‌లో నిర్మించిన డబుల్‌రోడ్డు, డివైడర్



ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన ఉద్యానవనం

# ఖానాపూర్‌కు ప్రగతి ప్రదాత

- నేడు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ
- సిద్ధమైన హెలీప్యాడ్.. ఏర్పాట్లు పూర్తి
- పర్యవేక్షించిన అభ్యర్థి జాన్సన్ నాయక్, ఎమ్మెల్సీ విఠల్, సీనియర్ నాయకుడు రవీందర్‌రావు
- భారీగా జన సమీకరణకు సన్నాహాలు


నిర్మల్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ) : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఖానాపూర్‌కు ప్రగతి ప్రదాత, సీఎం కేసీఆర్ రానున్నారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయం సమీపంలో గల సువిశాలమైన స్థలంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొననున్నారు. అధినేత సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు భారీ జన సమీకరణకు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. దాదాపు 60 వేల మందికి పైగా బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కేసీఆర్‌ను కళ్లారా చూసి, ఆయన ప్రసంగాన్ని వినేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరానున్నారు. కాగా సభా ప్రాంగణంలో వేదిక నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సీఎం రాక కోసం సభాస్థలి పక్కనే హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. శనివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్, ఎమ్మెల్సీ దండె విఠల్, సీనియర్ నాయకులు పైడిపెల్లి రవీందర్‌రావు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే సీఎం సభకోసం ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. వాహనాల పార్కింగ్‌కోసం హైటెక్ సిటీ స్థలాన్ని ఎంపిక చేశారు. నిర్మల్ వైపు నుంచి ఖానాపూర్ పట్టణంలోకి వచ్చే రోడ్డును సభ ముగిసే వరకు మూసివేయనున్నారు. రాజురా, అంకెన, పోచంపెల్లి, రాయదారి, ఉట్నూర్, కడెం తదితర ప్రాంతాల నుంచి వచ్చే వారు తర్లపాడ్ రోడ్డు, దిలావర్‌పూర్, లింగాపూర్ గ్రామాల మీదుగా సభా స్థలికి చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే మస్కాపూర్, సుర్జాపూర్, బాదన్‌కుర్తి వైపు నుంచి వచ్చే వాహనాలను జగన్నాథ్ చౌక్ గుండా అనుమతిస్తారు. కాగా సీఎం సభ కోసం జిల్లా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# రాహుల్‌గాంధీ ఏ ముఖం పెట్టుకొని వచ్చావు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ

ఎదులాపురం, నవంబర్ 25 : తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల బలిదానానికి కారణం మీరు కాదా? తెలంగాణ వస్తుందో రాదో అనే ఆవేదనతో ఆత్మహత్యలు చేసుకున్న సమయంలో సోనియా, ప్రియాంక రాహుల్ గాంధీ ఎవరికి కనిపించలేదని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. ఆదిలాబాద్‌లోని రాంనగర్, న్యూహౌసింగ్‌బోర్డు కాలనీలో కౌన్సిలర్లు పవన్ నాయక్, భూమన్న సుజాతతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో కనిపించలేదు. తెలంగాణ ఎన్నికల్లో అధికారం కోసం మాత్రం ప్రియాంక రాహుల్ గాంధీలు గల్లీకి వచ్చి ప్రదక్షణలు చేస్తున్నారని గుర్తు చేశారు. అలాగే బీజేపీ నాయకుడు బండి సంజయ్ ఇటీవల ఆదిలాబాద్ పర్యటనలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలాగా యువతను ఉసిగొలిపే విధంగా ప్రవర్తించడం అమానుషమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకుల మాటలు నమ్మిమోసపోవద్దని ఈ నెల 30వ తేదీన కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జులు చిలుక విలాస్, రావుల సోమన్న, నాయకులు భూమన్న, ప్రశాంత్ రెడ్డి, అశోక్, మునీర్, గంగన్న, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.




నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

REAL ESTATE

★ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రతిరోజు ఆదాయం పొందే అవకాశం. యాదగిరిగుట్టలో లగ్జరీ సూట్ ప్లాట్స్ కేవలం 26 లక్షలకే లాంచింగ్ ఆఫర్లో కలవు. సంప్ర|| సెల్: 9381128358
NTK-316687

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677